ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 11.07.2024 సమయం : 1310 గంటలు

1. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.
2. రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా, వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు.
3. రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపుచేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని భారత రాష్ట్ర సమితి కోరింది.
4. ఈ రోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నారు.

కేంద్రమంత్రి - ఏక్ పేడ్ మా కే నామ్’

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, వాటిని సంరక్షించి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ‘ఏక్ పేడ్ - మా- కే నామ్’ పేరిట ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మంత్రి ఈ రోజు హైదరాబాద్ లోని BJP నగర కార్యాలయంలో తన తల్లిగారి పేరిట మొక్కను నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, తల్లిని గౌరవించుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు అమ్మే ఒక స్ఫూర్తి కావాలని ప్రధాని ఆకాంక్షించారని ఆయన పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలన్నీ కాంక్రీట్ మయం అవుతున్న తరుణంలో పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను అందరం తీసుకోవాలని ఆయన కోరారు.

MSL

Add బస్తీ బాట- కేంద్ర మంత్రి:

కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి ఈరోజు హైదరాబాద్ లోని వాసవి బృందావన్ కాలనీలో పర్యటించారు. డ్రైనేజీ లీకేజీ, కరెంటు స్తంభాలు సక్రమంగా ఉండకపోవడం, పార్కింగు సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు.

ఎమ్.ఎస్.ఎల్.

వనమహోత్సవం

రాష్ట్ర వ్యాప్తంగా 20 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి వరంగల్ లోని లేబర్ కాలనీ ఈఎస్ఐ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. రాష్ట్రంలోని 14 వేల నర్సరీలలో మొక్కలు పెంచి నాటేందుకు సిద్ధం చేశామని పేర్కొన్నారు. కాగా, వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాన్ని చేరుకోవాలని, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

పిటిసి వరంగల్, రాజన్న సిరిసిల్ల

సాగు విస్తీర్ణం

రాష్ట్రంలో వానాకాలం సీజన్ లో సాగు విస్తీర్ణం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే 54 లక్షల 61 వేల 238 ఎకరాలలో రైతులు పంటలు వేసినట్టు వ్యవసాయ శాఖ తెలిపింది. ఇందులో, 36 లక్షల 88 వేల 217 ఎకరాలలో పత్తి, 4 లక్షల 14 వేలా, 016 ఎకరాలలో వరి సాగు అవుతున్నట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వచ్చే వారం నుంచి వరినాట్లు మరింత జోరుగా సాగే అవకాశం ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు.

డెస్క్

శాంతి భద్రతలు- KTR

రాష్ట్రంలో శాంతి భద్రతలను అదుపుచేసేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని భారత రాష్ట్ర సమితి కోరింది. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు K తారక రామారావు ఈ విషయమై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలియజేశారు. వార్తా పత్రికల్లో వస్తున్న కథనాలు రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని చెబుతున్నాయని పేర్కొన్నారు. బ్రాండ్ హైదరాబాద్ మసకబారుతోందని ఆరోపించారు. వరుస హత్యలు, అంతర్ రాష్ట్ర ముఠాల కార్యకలాపాలు ప్రతి ఒక్కరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలటం, పాలనా వైఫల్యాలను ఎత్తి చూపుతోందనీ, పెట్టుబడులు తరలిపోతున్నాయని ఇవి, ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు.

MSL

ఓటమిపై కమిటీ

గడచిన పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెసు పార్టీ ఓటమి పాలైన స్థానాల్లో, అందుకు గల కారణాలను విశ్లేషించేందుకు ఏర్పాటయిన ముగ్గురు సభ్యుల కమిటీ, ఈ రోజు హైదరాబాద్ లో గాంధీ భవన్ లో పార్టీ నాయకులతో సమావేశం అయింది. పార్టీ సభ్యుడు కురియన్ నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు రకిబుల్ హుస్సేన్, పర్గత్ సింగ్ సభ్యులుగా ఉన్న AICC

నిజ నిర్ధారణసంఘం నిన్న రాత్రి హైదరాబాద్ చేరుకుంది. గెలిచిన లోక్ సభ సభ్యులు, ఓడిన అభ్యర్థులతో ఈ కమిటీ విడివిడిగా సమావేశం అవుతోంది. ముఖ్యంగా పార్టీ ఓటమిపాలైన తొమ్మిది స్థానాలలో ఓటమికి కారణాలను విశ్లేషించి ఈ సంఘం నివేదిక సిద్ధం చేయనుంది.

MSL

ఎర్రచందనం దోపిడీ

తిరుమల శేషాచల కొండల్లో ఎర్రచందనం స్మగ్లింగ్ తో వేల కోట్ల రూపాయల జాతీయ సంపద దోపిడీకి గురైన విషయాన్ని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళతామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఈరోజు ఆయన తన పుట్టిన రోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎర్రచందనం స్మగ్లింగ్ పై నివేదిక తెప్పించి దాని ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. శ్రీవారి సంపదను కాపాడేందు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఎమ్.ఎస్.ఎల్.

Birth day wishes...

కాగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డిసహా పలువురు కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బండి సంజయ్ నివాసానికి పుష్పగుచ్ఛం, జన్మదిన శుభాకాంక్షలను ముఖ్యమంత్రి పంపారు.

ఎం.ఎస్.ఎల్

ప్రపంచ జనాభా దినోత్సవం

ఈరోజు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. జనాభా పెరుగుదల వల్ల ఏర్పడే సవాళ్ళు, అవకాశాల గురించి చర్చించేందుకు ప్రతి సంవత్సరం జులై 11న ఈ దినాన్ని పాటిస్తారు. జనాభా సంబంధమైన సమస్యల గురించి, సుస్థిరమైన భవిష్యత్తు దిశగా ముందడుగు వేయడం గురించి సమాలోచనలు జరుపుతారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ప్రపంచ జనాభా దినోత్సవానికి సంబంధించి అవగాహన ర్యాలీలు నిర్వహించారు. జనాభాను స్థిరీకరించడం ద్వారా జీవ వనరులు

సమపాళ్లలో వినియోగించుకునేందుకు సాధ్యపడుతుందని వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉప అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. ఈరోజు వనపర్తిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆశా వర్కర్ లు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నుండి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.

పిటిసి వనపర్తి

యాడ్ జనాభా

అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఈరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలోని క్లాక్ టవర్ చౌరస్తా వద్ద నుండి డిఎంహెచ్ఓ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ జండా ఊపి ప్రారంభించారు.

పిటిసి నల్లగొండ

సంపూర్ణత అభియాన్

సంపూర్ణత అభియాన్ కార్యక్రమంలో భాగంగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పలుచోట్ల ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆకాంక్షిత మండలం అయిన గుండాలలోని మూడు గ్రామ పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 30 ఏళ్లు దాటిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. అలాగే చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలకు పాలు, గుడ్లు వంటి పోషక విలువలు కలిగిన ఆహారం అందిస్తున్నారు. ఐసిడిఎస్ తమకు అందుతున్న అనుబంధ పౌష్టికాహారంపై చంద్రుగొండ మండలం గానుగపాడు గ్రామానికి చెందిన గర్భిణీ అనూష.. మా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి హరికృష్ణతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అందుతున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. -------(సౌండ్ బైట్ )---------

పిటిసి భద్రాద్రి కొత్తగూడెం

మంచిర్యాల – పోడు భూములు

పోడు భూముల సమస్య పరిష్కరంతో పాటు గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని ట్రైకార్ చైర్మన్ కె.తిరుపతి అన్నారు. ట్రైకార్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిన్న స్వస్థలమైన మంచిర్యాల జిల్లా దండేపల్లికి వచ్చిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు.

పిటిసి మంచిర్యాల